ప్రణయమాధురి

కామరాజు మైత్రేయి గారు

౧

విమల మంచివంశమున జన్మించినది. వారింట లక్ష్మి తాండవమాడుచుండెను. విమల తండ్రి నాగేంద్రశాయి. మంచిగుణరాశి. విమలకు విద్యచెప్పించి పెద్దదానిగచేసి ఆమె యిష్టమువచ్చినవానిని భర్తగా వరింపజేయవలెనని ఆయన అభిలాష. అతడు ఎంత తలచిన అంతపని జేయువాడు. మాటతప్పువాడుకాదు.

విమలయు మంచి సౌందర్యరాశి. తరగతులలో మంచి సూక్ష్మగ్రాహిణి అనిపేరు బడయుచుండెను. ఆమె తెలివితేటల కుపాధ్యాయులుకూడ అచ్చెరువందుచుండిరి. ఆమె తరగతులు వీడి యింటరుక్లాసు చదువుచుండెను. అచ్చట మొదటితరగతిలో యుత్తీర్ణురాలయ్యెను.

ఈ తరగతిలోనుండ ఆమెకు నవయౌవనమంకురించెను. ఈమెతరగతిలో జయరాముడు గోపసింహుడు అనునిరువురు పురుషులు చదువుచుండిరి. వీరిరువురు ఆమె స్నేహమునే అభిలషించుచుండిరి. వీరిరువురు ఆమెతోపాటు క్లాసులలో నుత్తీర్ణులగుచుండిరి. విమలయు వారిని ప్రోత్సహించుచుండెను. వీరి ముప్వురకు అన్యోన్యభావ ముదయించుచుండెను. ఇట్లు కొంతకాలము గడచెను. వారు బి. ఏ. కూడ ప్యాసు అయిరి.

జయరాము డొకనాడు 'ఈవినింగుసూటు' వేసుకుని, మంచి కాంబినేషన్ టై వేసి, బూట్సు బాగా అద్దములాగ పాలిష్ చేసి, విమలగృహముయొద్దకు బోయెను. తలుపులువేసి యుండెను. తలుపు తట్టెను. ఒకపనివాడు రాగా తన విజిటింగుకార్డు పంపెను. విమల సన్నని ఊదాసరిగెచీరె ధరించి H. G. Wells యొక్క నవలను చదువుచుండెను. ఆ విజిటింగుకార్డు చూడగానే విమల "సరే" అనికబురు పంపెను.

"గుడ్ ఈవినింగు. మిస్ విమల!" అని జయరాముడనెను. "హల్లో! గ్లాడ్ టు మీట్ యు" అని విమల అనెను.

జయరా:—విమలా! నీతో నాయొక్క జీవితవిషయములను గూర్చి మాట్లాడ వచ్చితిని. మనచిరకాలస్నేహము మరువక నీవు నాకు తగినసలహా యిచ్చి నన్ను సంతోషపరుపవలెను.

విమల:—ఏమిటది?

జయరా:—నేను ఆర్ట్సుకోర్సు చదువుచున్నను నాబుద్ధి దీనిమీద లేదు. నా కొక గొప్పడిటెక్టివ్ కావలెనని యున్నది. నామనస్సంతయు దానిమీద పోవుచున్నది. యిప్పటికి నేను క్రిమినాలజీ అంతా చదివినాను. పోలీసువారికి కూడా నాపేరు తెలిసినది. నాసలహాకు వారు అప్పుడప్పుడు వచ్చుచుందురు. నాకు సి. ఐ. డి. డిపార్టుమెంటులో ఉద్యోగము కాగలదు. నాకు జీవితమునుగురించి ఎక్కువ దిగులులేదు.

విమల:—నాకు ఈసంగతి ఇంతవఱకు తెలియదు. నాకు చాలాసంతోషముగా నున్నది.

పడకకుర్చీలో పడుకునియున్న విమలకూర్చొని, ఆతురతతో వినుచుండ జయరాము డిట్లు చెప్పెను. "కాని, విమలా! నాకు హృదయశాంతిలేదు. నాహృదయము ఒకరిమీద లగ్నమైయున్నది. ఆమె విద్యాపరిపూర్ణురాలు. ఆమెను నాహృదయపీఠమున నధిష్టింపజేసి నాప్రేమప్రసూనములతో పూజింపు చుందును. నేనిట్లు ప్రేమించుచుంటినన్ని ఆమెకు తెలియునో? తెలియదో? ఈసంగతి ఆమెకు జెప్పవలెనని యున్నది. ఆమె ఏమనునో తెలియదు. చెప్పుమందువా? లేక వద్దనెదవా? నీసలహా తీసికొనిగాని నేను ఏపని చెయ్యను."

విమల:—నీ ప్రేమరహస్యాలు చెప్పటానికి వచ్చావా? నాచేత నయినంతవరకు సహాయము చేస్తాను. ఆయువతీరత్నము ఎవరు? ఎంతధన్యురాలు!

జయరా:—ఆమెపేరు నీకెందుకు? ఆమె నీకు బాగా తెలియును. నీస్నేహితురాలే.

విమల:—ఈసంగతి నీలో నీవు దాచిపెట్టుకొని నీసుకుమారదేహమును కష్టపెట్టు దానికంటె నీహృదయరహస్యమును వెల్లడింపుము. ఆమెహృదయము కనిపెట్టి మాట్లాడుము. ఆమెహృదయము యితరులమీద లగ్నమైనదేమో పరికింపుము. ఇష్టమైన ఎడల శీఘ్రమే వివాహమొనరించుకొనుము. కాని నాకు వివాహమనిన యిష్టములేదు. మానవులు యిరువురు జన్మాంతమువఱకు కలిసి ఒకరికష్టములు సుఖములు ఒకరివని ఎంచుకొనుచు నివసించునప్పుడు వారిని ప్రేమతప్ప మరియొకటి బంధింపనేరదు. సంఘము ఎంతకట్టుదిట్టము చేసినప్పటికి ప్రేమలేనియెడల వారు సౌఖ్యమును అనుభవింపజాలరు.

జయరా:—నీకు వివాహమనిన సరిపడదా?

విమల:—వివాహమనిన నాయుద్దేశములో అర్థములేనిమాట. బెట్రాము రసిల్ గారు చెప్పినటుల ఒకరు భర్తయనియు, ఒకరుభార్యయనియు నుండినయెడల దుఃఖము తప్ప వేరు లేదు. ఒకరి కొకరు సహాయము చేసికొనుచు స్నేహితులవలె నుండవలెను. ఇట్లుండుటకు ప్రేమయే మూలకారణము. పోని! మనము వివాహము అనుపదమునుతీసివేయ లేనియెడల భార్యకు కూడ భర్తవలెనే విడిగా నుండుటకు, వివాహమును డైవర్సు(విడాకు) చేయుటకు హక్కు ఉండవలెను. ఇట్లు హక్కులుండుటకు, వారు దానిని చలాయించు టకును బాల్యవివాహములు చేయకూడదు. వివాహమనిన అర్థముకానిముగ్ధలకు వివాహ ములుచేసినచో 'డైవర్సు' అనిన అసలే అర్థముకాదు. అందులకు ఒప్పుకొనియెదవా?

జయరా:—నీవు వివాహవిషయములనుగూర్చి స్పెషలైజుచేసినట్లున్నావు. ముందు బాల్యవివాహనిషేధనచట్టము వచ్చిన పిదప సంఘప్రోద్బలముచే 'డైవర్సు' రాగలదు. ఇది వచ్చుటకు ఆడువారు వారి జాతిని విద్యనభ్యసించుటకు ప్రోద్బలము చేయువలెను.

విమల:—సరే! నాజీవితమంతయు దేశసేవకై వినియోగించి ఏది ఏమయినను నాజీవిత మెంత నీచమయినను నాయిచ్ఛయే నెరవేర్చుకుని మాజాతికి ఆదర్శపురాల నయ్యెదను.

జయరా:—విమలా! నాసంగతి మరచితివి. నాహృదయపీఠ మలంకరించిన శృంగార వతివి నీవే! ఆ విద్యావంతురాలవు నీవే! ఆ పువ్వుల గుత్తివి నీవే! ఆ పుష్పలతవు నీవే! నిన్ను వివాహమాడవలెనని యున్నది. నాయావజ్జీవము నీయిష్టాభిలాషయందే వినియో గించి ఎల్లపుడు నీసేవకుడనుగా నుండెదను. విమలా! వివాహముల మీద నీ అపోహలు మాని నన్ను చేకొమ్ము. నీమనసు నొచ్చకుండ నే ప్రవర్తించెదను.

విమల:—ఎంతచదువు చదివినను నీవు నీప్రాతయుద్దేశ్యముల మానలేదు. నీవు ఏదో సంఘసంస్కారివనుకుంటిని. నీకంటె మనరూపసింహుడు మంచి సంఘసంస్కారి. అతని యుద్దేశ్యములు నాయుద్దేశ్యములు సరిపడినవి. మేమిరువురము స్నేహితులముగా నివశింప దలచితిమి. మాజీవితములు ఈవిషయచర్చ యందే ధారపోయ దలంచితిమి. మేము సంఘము పెట్టు కష్టములను ఓర్చదలచితిమి. సత్యవాక్ప్రియుడగు భగవానుడు మాకు తోడ్పడుగాక!

జయరా:—"అమ్మా! విమలా! నాయుద్దేశ్యములు అంతముందంజవేయక పోయినను మిమ్ములను ఆశీర్వదించెదను. మీకష్టములలో పాల్గొనెదను. సదా నీసౌఖ్యము నేను కోరుచుందును. విమలా! యీజయరాముని మరువకుము. రూపసింహుడు నాప్రియ స్నేహితుడు. నానమస్కృతులు అతనికి అర్పింపుము." అని ఆతడు తనగృహమునకు పోయెను. విమలారూపసింహులు భార్యాభర్తలవలె నివశించుచుండిరి.

2

అక్రూరుడు:—శారదా! మనకు క్రొత్తపని తగిలినది. విమలారూపసింహుల సంగతి పత్రికలలో చదివితివా? బాగానేయున్నది. నేను ప్రేమవివాహములను నమ్మను. విమల మంచిరూపవతి.

శారద:—మరల మొదలుపెట్టినారూ! యీతడవ ఏమి ఎత్తు?

అక్రూరుడు:—రూపసింహుడు విమలకు మంచిరవ్వలహారము యిచ్చినాడట. అది మనము......సరే. భాగములకేమిలే. ఇదివరకు ఎన్నిమారు లివ్వలేదు. వారి దగ్గరకు స్నేహితులవలె చేరవలెను. సరే! నేను నీభర్తగా నటించెదను. ఇద్దరము వారింటి ప్రక్కయిల్లు అద్దెకు తీసికొందము. ప్రయత్నములకు లోపములేదు. కార్యము సాగవలెను. దైవసహాయము ఉండవలెను. దొరకెనా!.........ఇరవయివేల రూప్యములు.

3

విమలారూపసింహులు చాల అన్యోన్యముగ నివశించుచుండిరి. వారి జీవితములను చూచిన ఆశ్చర్యము కలుగుచుండెను. ఒకనాడు వారింటిలో విందుచేసిరి. జయరాముడు, శారద, అక్రూరుడు కూడ దయచేసిరి. శారద అక్రూరుని రూపసింహునకు పరిచయము చేసినది. రూపసింహుడు అక్రూరుని విమలకు తెలియపరచెను. అక్రూరుని కళ్లన్నియును ఆవిమల రవ్వలహారము మీదనేయుండెను.

అక్రూరుడు:—విమలా! నీహారము చాలా అందముగా నున్నది. నీసొగసైన మెడకు వింతఅందము తెచ్చుచున్నది. దానితో నీవు ఫోటోతీయించుకొనిన బాగుండును. నాకు ఫోటోతీయుటలో కొంచెము ప్రవేశమున్నది.

విమల:—రూపసింహునకు ఇటువంటివి నచ్చవు. కాని మీరు ఫోటోతీయగలరా? నాకు తెలియదు.

అక్రూరుడు మెల్లగా ఎట్లనో శారదచేత చెప్పించి, విమలను ఫోటోకు తన గృహమునకు వచ్చునట్లు చేసెను. ఆదినమున రూపసింహుడు యూరలేడు. కాని (మంచి అపరాధపరిశోధకుడు) జయరాముడు కలడుగదా! అక్రూరుని చూచినప్పటి నుండియు జయరాముడు అతనిమీద అనుమానము వహించెను. అతని ఎత్తులన్నియు పరిశీలించుచుండెను. విమల అక్రూరుని ఇంటికిపోవుటకు ఒప్పుకొనినట్లుకూడ జయరాముడు విమలదాసివలన తెలిసికొనెను.

౪

విమల సాయంత్రము మూడుగంటలకు అక్రూరుని గృహమునకువచ్చెను. అక్రూరుడు ఆరవ్వలహారమునె చూచుచుండెను. ఎంతచెడినను యిరుగు పొరుగువారేకదా! అక్కడ ఫోటోకెమీరా యుండెను. దాని ఎదుట కుర్చీ వేయబడియుండెను. హాలుఅంతయు అందముగా నుండెను. అకుర్చీప్రక్కన క్రోటన్సు మొక్కలు చక్కగా అమర్చబడియుండెను. ఆహాలు మనస్సు రంజింపచేయుచుండెను. అక్రూరుడువచ్చి "విమలా! నేత్రానందకరముగా నుంటివి" అనెను.

విమల:—అవేటిమాటలు?

అక్రూరుడు "సరియే! యిదిగో—ఈ ప్రక్కకు తిరిగి నీమొక్కముఖము యిటు తిప్పి తిప్పిన తల కొంచెము—పక్కవాటుగాపెట్టు"—అని తలను తిప్పి సరిగా కెమేరాకు ఎదుర్కొని ఆమె చుబుకము కొంచెము ప్రక్కకుతిప్పి లెన్సు అయిపోయినదని చెప్పెను. రవ్వలహారము తీసివైచి యింకొకటివేసెను. విమలకు ఇదంతయు ఆశ్చర్యకరముగా నుండెను. మరల తనదుస్తులను ధరించి "నాహారమేది? నాహారమునాకియ్యి" అని గద్దించి అడిగెను.

అక్రూరుడు "ఆ—హారమా?—సరేయిచ్చెదను. కాని ఫోటో యిప్పుడే డెవెలప్ చేసి యిచ్చెదను." అని దానిని విమలకు తీసుకునివచ్చి చూపెను. విమల ఆశ్చర్యనిమగ్నురాలయ్యెను. అందులో అక్రూరుని బాహువల్లికలతో విమల చెక్కిళ్లు వత్తుచున్నట్లు ఫోటోయుండెను. ఇది ఎట్లువచ్చెను? అక్రూరుడు వికటహాసముచేయుచుండెను.

"ఛీ క్రూరాత్మా! నన్ను ఇట్లువంచించుటకా నీవు పిలిపించినది? నీపాడు మనస్సు కనిపెట్టలేకపోయితిని! మానవాధముడవు. పాపివి, క్రూరుడవు." అని ఆమె ఆ బొమ్మను చించివేయబోయెను.

అక్రూరుడు నవ్వి "విమలా! నీవది చించినను నాదగ్గిర 'నెగిటివ్'యున్నది. దానితో లక్షలకొలది కాపీలు తీసెదను. నిన్నుసంఘములో పాడుచేసెదను. నీవు నాకు హారమును ఇచ్చిన ఎడల యీనెగిటివ్‌ను పగులగొట్టెదను—నేను ఫొటోతీసినది 'ఆటోమాటిక్ సెల్ఫుటైమరు' తెలిసినదా? విమలా! నాచేత చిక్కితివి."

విమల ఏమియుమాటాడలేదు. కనులు భాష్పపూరితము లయ్యెను. వదన మెఱ్ఱబడెను. ఏమిచేయుటకుతోచలేదు. ఇంకదిక్కెవ్వరు? శారద కానరాలేదు. రూపసింహునకు యీఫొటో కనుపించెనా—తనజీవితమంతయుబూడిదలోపోసినపన్నీరగును. ఎవ్వరుదిక్కు? పోనీ హారమిచ్చునదుకొనుడు! వాడు ఆనెగిటివ్‌ను పగులగొట్టునా? యేమో! రూపసింహుడు హారమేదని అడిగిన ఆమె యేమిచెప్పును? పోయినదనిచెప్పిన నమ్మునా? ఏడ్చుచు విమల తనగృహమునకు పోయెను.

జయరామునకు ఇదంతయు తెలిసిపోయెను విమలదాసివలన. రూపసింహు డూరినుండి వచ్చెను. తాను వెళ్లిన వ్యవహారము కొనసాగినందుకు సంతోషించి ఆతడు స్నేహితులందరికి విందునీయదలచెను. ఆరేయి విమలను ఆరవ్వలహారమును ధరింపమని ఆతడు చెప్పెను. విమలకు ఏమిచేయుటకు దోపకుండెను. దుఃఖసముద్రమున దరిగానక ఆమె కొట్టుకొనుచుండెను.

అచ్చట జయరాముడు తన ప్రయత్నము సాగించెను.

౫

"తలుపుతీయండి. త్వరగా. ఆలస్యము చేయకూడదు." అని అక్రూరుని గృహద్వారమును ఎవరో కొట్టుచుండిరి. "ఒక తపాలాబంట్రోతు ఏదో ఒకప్యాకెట్ తీసికొని వచ్చేడు" అని శారద అక్రూరునికి తెలియపరచెను. "నీవు తీసికొనిరా" అనెను అక్రూరుడు. ఆమాటమీద తపాలాబంట్రోతు "ఎవ్వరివిలాసము వ్రాయబడియున్నదో వారికేగాని యితరులకు ఇచ్చుటకు వీలులేదు" అనుచు చొరవతో లోపలికివచ్చి అప్యాకెట్టు అక్రూరుని హస్తమునందుంచెను. అక్రూరుడు దానిని ఇటునటు త్రిప్పుచుండెను. ఇంతలో నాసేవకుడు 'దానికిమీరు 15 రూపాయిలు యివ్వవలెనండి. ఇప్పుడు యిచ్చెదరా? లేని

ఎడల రేపు వచ్చెదను." అని దానిని తీసికొని పరువెత్తెను. అది ఎవ్వరో చదువరు లూహింపగలరా? అది మనజయరాముడే!

ఆప్యాకెట్‌మీద కెమికల్ కాగితమునువేసి పైవిలాసమును వ్రాసెను.

ఆప్యాకెట్టు అక్రూరుని హస్తములందు పెట్టినవెంటనే వాని చేతిముద్ర ఆకాగితము మీదపడెను. దానిని ఫొటోదీసి పెద్దదిగాచేసి పోలీసువారికి పంపి దాని చరిత్రను తెలుపు డని ఆతడు వారిని కోరెను. దానికి వారు యిట్లుజవాబిచ్చిరి. "ఈ హస్తముద్ర యిదివఱకు ఖైదులోనుండి తప్పించుకొనిపోయిన దుండగీనిది. ఇతడు యింతకు పూర్వము నాలుగుతడ వలు శిక్షింపబడెను. ఇతని నివాసస్థలము తెలిసికొని యితనిని పట్టి ఇచ్చిన ఎడల వెయ్యి రూప్యములు బహుమతి యిచ్చెదము. కడు అసాధ్యుడు. జాగ్రత."

జయరాముడిది చూచి అక్రూరుని ఇంటికి వెళ్లెను. శారద మాత్రముండెను.

జయరాముడు:—అక్రూరుడేడీ?

శారద:—బజారు వెళ్లినాడు.

జయరాముడు.—ఎప్పుడు వచ్చును?

శారద.—ఏమో తెలియదు.

జయరాముడు.—సరే! హారము మార్చుటకు వెళ్లినాడా?

శారద.—అదేమిటి!

జయరాముడు.—నీవు నిజము చెప్పకున్న నిన్నుకూడ శిక్షింతును. అక్రూరుని మాయవేషము తెలిసెను. నేను పోలీసుపత్తేదారుని. నీకు తెలిసినది చెప్పుము. లేని ఎడల—ఆడుదానవు—చిక్కులబడుదువు. నీవు తప్పించుకొనిపోవుటకు వీలులేదు. చేత చూచితివా? పిస్టోల్. జాగ్రత్త! నిజముచెప్పి ప్రాణము కాపాడుకొనుము.

శారద:—(భయకంపితయై హీనస్వరముతో) నిజముచెప్పెదను. నన్నురక్షింపుడు. నేను అక్రూరుని అల్‌బాదునందు కలిసికొంటిని. నన్ను యీవిధముగానే మోసపుచ్చి తన బానిసగా చేసికొనినాడు. నాకు ఇందుభాగము యిచ్చెదనని చెప్పి వెళ్లినాడు. మరల వచ్చునని నాకు నమ్మకములేదు. నన్ను రక్షింపుడు. బహుశః అతడు స్వగృహమునకు పోయి ఉండును.

జయరాముడు.—నాయుద్దేశ్యమును ఆలాగునే యున్నది. సరే. నేవచ్చువఱకు ఇక్కడనే యుండుము. లేకున్న కష్టములు వాటిల్లును.

అంత జయరాముడు అక్రూరుని నివాసస్థానమునకు బోయెను. ఆ గృహము కనుగొనెను. పోయి ఆతని దొడ్డిలో నొకగడ్డివాములో దూరెను. అక్రూరుని భార్యగడ్డి దీసికొనుటకు వచ్చి జయరాముని కనుగొనెను. "నాభర్తను తీసికొనిపోవవచ్చితివా?" అని బడితతో నాతనిని బాదనారంభించెను. జయరాముడు బయటికివచ్చి "అతని దగ్గిర ఒక హారము ఒకఫొటో నేగిటివ్ ఉన్నవి. అవి యిచ్చిన నీ భర్తతో నాకు సంబంధములేదు. అవి తెచ్చి ఇమ్ము. లేకున్న పోలీసువారిని పిలిచెదను. వారు యిచ్చటనే దాగుకొని యున్నారు. ఈలవేసినవచ్చెదరు." అని పలికెను. అందుమీద అక్రూరుని భార్య ఆరవ్వల హారమును ఆనెగిటివ్‌ను తెచ్చియిచ్చెను.

జయరాముడవి తీసికొని రూపసింహుని గృహమునకు వచ్చెను. అప్పుడే విందు ప్రారంభమయ్యెను. స్నేహితులందఱు వచ్చిరి. విమల ముఖమున తప్ప మిగిలినవారి ముఖములందు ఆనందము తాండవించుచుండెను.

జయరాముడువచ్చి "విమలా! ఏమిటి యింతటి అశ్రద్ధ. నీహారము ఆగదిలో నేలమీదపడియున్నది. ఇదిగో జాగ్రత్తగా చూచుకో. రూపసింహా! చూచితివా ? విమల అశ్రద్ధ." అనెను. విమలహృదయము అప్పుడు ఎట్లుండెనో? ఆలోచింపుడు. రెండు రోజుల తరువాత జయరామునకు ఒకజాబువచ్చెను. అది విమలవద్దనుంచి వచ్చినది.

"ప్రియమైన జయరామునకు,—

నీవునాకు చేసినమేలు మరచుటకు వీలులేకుండ చేసితివి. నన్ను నీచపు బ్రతుకు నుండి తప్పించితివి. నీహృదయము దయార్ద్రమని యెంచనైతిని. నాజీవితము రూపసింహునితో హాయిగానున్నది. మాకు యేవిధమైన తగవులులేవు. మేము నిరంతరము ఒకరి నొకరు ప్రేమించుచుందుము. మేము బానిసత్వపు వివాహమును గావించుకొనలేదు. అతను నొచ్చుకొనునని నేను నేను కష్టపడుదునని రూపసింహుడును జాగరూకతతో ప్రవర్తించుచుంటిమి. ఇదియే మాఅన్యోన్యభావమునకు కారణము. మాజీవితములు దీనికర్పింతుము. మాయిరువురి సౌఖ్యము కాపాడినందులకు—దుష్టుడగు అక్రూరుని ఆటలు తారుమారు చేసినందుకు నీకు నాసహస్రవందనములు. నీకును నాబోటితరుణి ఒకతె లభించుగాక యని కోరుచున్నాను.

ఇట్లు, విమల."